# కథ వెనుక కథ

**జీ**వితంలో మార్పువచ్చింది. పిల్లలు పెద్దవాళ్లైపోయారు. నా అవసరం తీరిపోయింది. ఫలితం విసుగెత్తించేంత విశ్రాంతి. ఏం చెయ్యాలి? ఎలా కాలం గడపాలి? కూర్చున్నా లేచినా పడుకున్నా మేలుకున్నా ఇదే ఆలోచన.

చాలా రోజులు బుర్రబద్దలు కొట్టుకున్న తర్వాత మాంచి ఆలోచన వచ్చింది. ఏదైనా వ్యాసాలూగట్రా రాసి పత్రికలకి పంపితే ఎలా వుంటుంది? నా ఆలోచన నా ఫ్రెండ్‌తో చెప్పాను.

ఆనందపడిపోయింది. దివ్యంగావుంది నీ ఐడియా, నీకా టాలెంట్ వుంది. ప్రయత్నిస్తే చక్కగారాయగలవ్ అంటూ ప్రోత్సహించింది.

అంతటితో ఆగకుండా ఓ సలహా కూడా ఇచ్చింది. వ్యాసాలురాస్తే ఏం లాభం లేదు. కథలురాయి. మరీ మాట్లాడితే ఓ నవల రాసేవంటే ఇక నీ జాతకం తిరిగిపోయినట్లే.

ఇప్పుడు రైటర్స్‌కి ఎంత డిమాండ్‌గా వుందో చెప్పలేం. మామూలుగా మొదలు పెట్టి మూడేళ్ళు తిరిగేసరికి ఇళ్ళు కట్టేసుకుని కార్లు కొనేసుకుని బోల్డంత డబ్బు వెనకేసుకుంటున్నారు.

కాబట్టి కాస్త కష్టమైనా నువ్వుకూడా ఓ నవల రాసిపారేశావంటే ఇక చూసుకో!" అంది.

అంతేకాదు. ఇంకా ఎన్నో విషయాలు చెప్పింది. అదంతా విన్నాక నాకు మహా ఉత్సాహం వేసింది. సీరియస్‌గా ఆలోచించి నవల రాయడానికే నిర్ణయించుకున్నాను.

నా నిర్ణయం ఇంట్లో అందరికీ చెప్పాను. అంతా సంతోషించేరు. నాకో పెన్నూ నాలుగు కాయితాలూ ఇవ్వాలి మీరు అన్నాను. పిల్లలంతా "కాయితాలకేం భాగ్యం కావలసినన్ని" అంటూ వెంటనే ఇచ్చారు. కానీ రాసే పెన్ను మాత్రం ఓ పట్టాన దొరకలేదు.

"ఇదుగో అమ్మా పెన్ను బాగుంది. కాపోతే కాస్త బలంగా రాయాలంతే! తీసుకో అంది!" కూతురు. ఆ పెన్ తీసుకుని శ్రీరామ అని మూడు సార్లు రాసేసరికి ఆయాసం వచ్చినంత పనైంది. దాని పెన్ దానికిచ్చి దణ్ణం పెట్టాను.

ఆ తర్వాత కొడుకు రంగంలోకి దూకాడు. వాడడం మానేసిన పెన్ తీసి, పాళీని పళ్ళతో పీకి ఏమిటో అయిదునిమిషాలు రిపేర్ చేసి నాచేతికిచ్చాడు. బాగా రాస్తుందమ్మా అని వాడు హామీ ఇచ్చాడు. కానీ వాడి చేతులూ మూతీ చూశాక నాకే ధైర్యం చాల్లేదు.

ఇలాకాదని సరుకులకోసం వెళ్ళినపుడు ఆర్రూపాయలు పెట్టి ఓ బాల్‌పెన్ కొనుక్కొచ్చుకున్నాను. మంచి రోజు చూసుకుని శ్రీకారం చుట్టాను. మొదలు పెట్టిన వేళావిశేషం ఎలా ఉందో గానీ ఎక్కడా ఆగకుండా సాగింది రచన. నెల తిరిగేసరికల్లా నవల తయారై పోయింది. చదువుకొని ఆనందపడిపోయాను. ఇన్నాళ్ళు ఎందుకు రాయలేదా! అని నామీద నాకే కోపం వచ్చింది. నాలాటి మహారచయిత్రి రచనలు చదవగలిగే పాఠకుల అదృష్టానికి సంతోషం కలిగింది.

నవల పూర్తయిపోయింది. ఎవరికి పంపాలి? ఏ పత్రికకి పంపాలి? పాతుకుపోయిన పత్రికలకా? కొత్తపత్రికలకా? తర్జన భర్జనల అనంతరం "అయోమయం" అనే కొత్త పత్రికకి పంపాలనుకున్నాను. పోస్ట్‌లో పంపేకంటే స్వయంగా తీసికెళ్ళి ఇస్తే బావుంటుందని సలహాఇచ్చారు శ్రేయోభిలాషులు.

మంచి రోజు చూసుకుని నవల పట్టుకుని రిక్షాలో కూర్చుని ఆ పత్రికాఫీసుకి వెళ్ళాను. పెద్దగేటు, గేటుదాటగానే పక్కనే సెక్యూరిటీ.

అక్కడికి వెళ్ళి ఎడిటర్‌గారిని కలుసుకోవాలని చెప్పాను. అయిదు నిముషాలు కూర్చోబెట్టి లోపలికి వెళ్ళమన్నారు.

కాళ్ళు వణకిపోతూవుంటే ఎలాగో లోపలికి వెళ్ళాను. ఎడిటర్‌గారి రూమ్ లోకివెళ్ళాను. ఆయన చిన్నగా నవ్వేరు. కూర్చోమన్నారు. ఎంతో మర్యాదగా మాట్లాడారు.

నేను రచనలు చెయ్యడం ప్రారంభించానని తెలుసుకుని చాలా సంతోషించారు. “మీలాటి వారు ముందుకి రావాలి. మంచి రచనలు చెయ్యాలి. మీవంటి వారికి ప్రోత్సాహం ఇవ్వడం మా పత్రిక ధ్యేయం” అన్నారు.

అమితానందంతో నా “అతుకుల బ్రతుకులు” నవలని ఆయనకి అందజేసాను. “చదివి చూస్తానమ్మా. ఏమాత్రం బాగున్నా ప్రచురిస్తాను” అన్నారు. “మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు? అని అడిగాను.”

“మీరు రానవసరంలేదు. పోస్ట్ ద్వారా తెలియజేస్తాం!” అన్నారు. “సుమారుగా ఎన్నాళ్ళు పడుతుందండీ!” అని అడిగాను.

“మామూలు పత్రికల్లో అయితే ఏళ్ళ తరబడి పరిశీలలో వుంచుతారు. మేము అలాకాదు... రెండుమాసాల్లో ఏ విషయం చెప్పేస్తాం!” అన్నారు. వారికి నమస్కారం పెట్టి ఇవతలికి వచ్చాను. గేటుదగ్గరికి రాగానే ఒక పెద్దమనిషి కనిపించాడు. పాతి కేళ్ళుంటాయి. నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు. అతనెవరో తెలియకపోయినా నేనూ నవ్వేను.

నా దగ్గరకు వచ్చాడు. “మీరు రైటరా?” అని అడిగాడు. ఏం చెప్పాలో అర్థంకాక వూరుకున్నాను. “ఏం రాశారు?” అని అడిగాడు. నా హిస్టరి అంతా చెప్పాను.

తన విషయం చెప్పుకొచ్చాడు. నాలుగైదు కథలు రాశాడట. అందులో మూడు పబ్లిష్ అయ్యాయిట. ప్రస్తుతం “వాడు వాడు కాదు వీడు” అనే సస్పెన్స్ నవల రాశాడుట. “ఎడిటర్‌గారు మంచివారే. నాకు చాలా ఆశగా వుంది” అన్నాడు. అలా ఒక సాహితీ బంధువుని కలుసుకోటం మరింత ఆనందంగా అనిపించింది.

ఆ తరువాత మూడు నెలలు గడిచిపోయాయి, అతికష్టం మీద. ఇక లాభం లేదని నిరాశపడుతున్న తరుణంలో ఒకరోజు ఆ పత్రికవారి నుండి ఉత్తరం వచ్చింది.

“మీరచన అతుకుల బ్రతుకులు ప్రచురణకు స్వీకరించాం. పారితోషికం వెయ్యిరూపాయలు, సెప్టెంబర్ నెలలో ప్రచురిస్తాం, ఈ ఉత్తరంతో జతపరచిన ఫారం ఫిలప్ చేసి పంపించండి.”

ఆ ఉత్తరం చదివి ఆనందంతో మూర్ఛపోయాను. ఆ సాయంత్రం మా ఇంట్లో ఒకటే సందడీ హడావిడీ. మా ఆయనకూడా చాలా సంతోషించారు. “ఇది బాగానే వుంది. నీకు కాలక్షేపం. ఇంటి పట్టున వుండి మాకు వేల్టికి అన్నీ అమరుస్తూనే సంపాదనకూడానూ గుడ్. డెవలప్ చేసుకో” అన్నారు.

ఆ తరువాత మరోరెండు నెలలు గడిచిపోయాయి. సెప్టెంబరు నెల సంచికలో నా నవల "అతుకుల బ్రతుకులు" ప్రచురించబడింది. ప్రింట్‌లో నాపేరు చూసుకుని ఆనందంతో ఏడ్చేశాను. ఒకటిరెండు చోట్ల లైన్లు తారుమారైపోయాయి. కావలసినన్ని అచ్చు తప్పులు. కొంచెం బాధనిపించినా వెంటనే పోన్లే అనుకున్నాను. నవల చివర "అద్యంతాలకు ఆవల" అనే కవిత ప్రచురించారు. అదీ బాగానే వుంది.

నా నవలను బంధుమిత్రులంతా చదవాలని మా శ్రీవారు ఓ పది కాపీలు కొని అందరికీ అందించారు. వారు చదివి మెచ్చుకున్నారు. అందరి దృష్టి నవల మీదేవున్నా నా ఆలోచన అంతా రాబోయే పారితోషికం మీదే వుంది.

దీపావళి పండుగ ముందుంది. నాకు రాబోయే డబ్బులతో పిల్లలిద్దరికి చెరోజతా బట్టలూ, టపాకాయలు కొందామని ప్లాన్ వేసుకున్నాను. ఆయన కోసం ఏంకొనాలో తెలియక తికమక పడ్డాను. చూస్తుండగానే దీపావళి వచ్చేసింది. కానీ నా డబ్బులు మాత్రం రాలేదు. నేను నిరాశ పడుతుంటే ఆయన ధైర్యం చెప్పారు. 'నీకంతా తొందర. నిదానంగా వస్తుంది' అన్నారు.

సరే పోన్లే. అయినా మనకేం పండుగలకి తక్కువా? సంక్రాంతి వుండనే వుంది. ఆ డబ్బుకి వాళ్ళ ముగ్గురికీ పండగకి బట్టలు కొందాం అని సంబర పడ్డాను. సంక్రాంతి వచ్చింది పోయింది పర్వాలేదులే రెండూ ఇన్‌కమ్‌టాక్స్ నెలలు. జీతాలు పూర్తిగా రావు కదా అప్పుడాదు కుంటాయి ఈ వెయ్యి అనుకున్నాను. మార్చి వెళ్ళి పోయింది. సర్లే ఆవకాయ ఖర్చుకీ వుంటాయి అనుకున్నా. ఆవకాయ పెట్టడం అయిపోయింది. ఆ డబ్బు మాత్రం అజాపజాలేదు.

ఆ మధ్యకాలంలో ఆ పత్రిక వారికి బోలెడు ఉత్తరాలు రాశాను. కానీ వారినుండి ఏ సమాధానమూ రాలేదు.

ఇక ఇలా లాభం లేదని ఆటోలో బయలుదేరాను. ఆఫీసుకెళ్ళాను. అరగంట కూర్చున్న తరువాత లోపలికి పిలుపు వచ్చింది. వెళ్ళాను. ఎండలోంచి చీకట్లోకి వెళ్ళానేమో కళ్ళు తిన్నగా కనిపించలేదు. మసక మసగ్గా కనిపించేరు ఎడిటర్ గారు.

"అదేవిటి సార్ జుట్టంతా అలా పూడి పోయిందేం?" అని పరామర్శించబోయే లోగా కళ్లు చీకటికి అలవాటు పడ్డాయ్. అప్పుడు నేను చూసిన మనిషికాదీయన. నమస్కారం పెట్టాను. కూర్చోమన్నారు. కూర్చున్నాను.

"ఏం కావాలి?" అని అడిగారు.

నన్ను పరిచయం చేసుకున్నాను నేను పత్రికకి అతుకుల బతుకులు అనే నవల రాశానండీ సెప్టెంబర్ సంచికలో ప్రచురించి పారితోషికం పంపలేదండీ ఎన్నో ఉత్తరాలు రాశానండీ, కాని సమాధానం రాలేదు అని అన్నాను.

"యాదగిరీ" అని పిలిచాడు. ఆయన నాలుగూళ్ళు వినబడేలా.

యాదగిరి వచ్చాడు

"నీకెన్ని సార్లు చెప్పాను. ఇలా డబ్బు కోసం వచ్చే వాళ్ళని నా దగ్గరకు పంపొద్దని, నాకు వేరే పనేం లేదనుకున్నావా? ఇదే లాస్ట్ వార్నింగ్ ఎవరైనా కథలు పట్టుకొస్తే మాత్రం నా దగ్గరికి పంపించు. ఏం అర్థం అయిందా?" అని గర్జించాడు. తెల్లవారి ఆఫీసుకి రావడం ఆలస్యం. మొదలు నాకు డబ్బులివ్వాలి నాకు డబ్బు లివ్వాలి అంటూ ఒకటే సొద. ఇవ్వక పారిపోతామా అంటూ సణుక్కున్నాడు. అందరికీ వినిపించేలా "నేను అలాపోయి టీతాగొస్తాను" అంటూ అదేస్థాయిలో అరిచి వెళ్ళిపోయాడు.

ఆతతంగం అంతాచూసి నా ప్రాణం చచ్చిపోయింది. చాలా మొహమాటం వేసింది. తలొంచుకుని ఇవతలికి వచ్చేశాను.

ఇంటికొచ్చి ఓ కప్పుకాఫీ తాగాక అప్పుడు ఆ గాభరా తగ్గింది. ఆలోచిస్తే ఆయన బాధ కూడా నిజమే అనిపించింది. పాపం ఏవో ఇబ్బందుల్లో వుండి వుంటారు. నెమ్మదిగా ఇస్తారు కాబోలు అనుకున్నాను.

ఉత్తరాలు రాయటం మాత్రం మానలేదు. రెండు నెలలు గడిచిపోయాయి. ఒకరోజు కూరల మార్కెట్లో కొత్తిమీర బేరం చేస్తుంటే ఎవరో పిల్చినట్లు అనిపించి వెనక్కితిరిగి చూశాను. ఎవరో పాతికేళ్ళ యంగ్‌ఫెలో. నేను చూడగానే నవ్వేడు.

మీరు ఫలానా కదూ అని అడిగాడు. అవునన్నాను. "మీరు అయోమయం పత్రికలో అతకని బ్రతుకులు నవల రాశారు కదూ?" అని అడిగాడు.

"ఆశ్చర్యపోయాను. ఏవిటో నేనింత పాపులర్ ఫిగర్‌ని అయిపోయానా? ఇలా అయితే పబ్లిగ్గా బయటికి రావడం కష్టం అయిపోతుంది"!

"మీ ఫోటో చూసి గుర్తుపట్టాను అదే సంచికలో నేనొక కవిత రాశాను. వాళ్ళు మీకు డబ్బులిచ్చారా అండీ" అని అడిగాడు నీరసం వేసింది. "ఇవ్వలేదండీ" అన్నాను.

"అయితే మీకూ ఇవ్వలేదా అండీ? మొన్న ఆ ఆఫీసుకి వెళ్తే ఏవిటయ్యా కవితరాసి డబ్బు కోసం కాకిలా తిరుగుతావ్. నవలా, కథా అయితే వెంటనే ఇచ్చేసేవాళ్ళం. కవిత్వం విషయంలో ఆలస్యం అవుతుంది. అన్నారు. అది విని నేనెంతో బాధ పడ్డాను. అయితే మీకూ ఇవ్వలేదన్న మాట. అమ్మయ్య." అనేసి "లల్లల్లా" అని పాడుకుంటూ వెళ్ళి పోయాడు.

దుఃఖం ముంచుకొచ్చింది. మరో రెండు నెలలు గడిచిపోయాయి. షరా మామూలే. వదిలేసి వూరుకుందామంటే ఒకటారెండా వెయ్యిరూపాయలు, మనసొప్పక మళ్ళీ బయలుదేరాను.

అయోమయం ఆఫీసుకు వెళ్ళాను. పద్ధతంతామారి పోయినట్లు అనిపించింది. ఎడిటర్‌గారి రూమ్‌కి తాటికాయంత తాళం అటూఇటూ చూసి ఎదురుగా కనిపించిన ప్రాణిదగ్గరకు వెళ్ళాను.

"ఎడిటర్ గారు ఏరిబాబూ?" అడిగాను "లేరండీ"! అన్నాడు

"ఎప్పుడొస్తారండీ?"

"తెలియదండీ".

"నేను పత్రికకి ఓ నవల రాశానండీ. దానికి రెమ్యునరేషన్ పంపలేదు మీరు".

"అవున్నిజమే. మీకేకాదు చాలా మందికి పంపలేదు. వాళ్ళంతా పాపం వచ్చి తిరిగిపోతున్నారు".

"డబ్బులిస్తామని చెప్పి నవల వేసి ఇలా చెయ్యడం అన్యాయం కదండీ".

"నిజం. చాలా అన్యాయమేనండీ"

"అన్యాయం అని వూరుకుంటే ఏం లాభం చెప్పండి?"

"వూరుకోక నన్నేం చెయ్యమంటారండీ?"

"పారితోషికం ఇచ్చేలాచూడండి"

"ఆ విషయం గురించి నాకేం తెలీదండీ"

"మరి మీకేం తెలుసండీ"

"లెటర్స్ గట్రా రిసీవ్ చేసుకుని సమాధానాలూ అవీ ఇస్తుంటాను అంతే నా పని.

"పోనీ ఈ విషయం ఎవరిని అడగాలండీ"?

"ఏమో నాకు తెలీదండి".

"సరే ఎవరికి తెలుసండీ"?

"ఎడిటర్‌గారికి తెలుస్తుందండీ".

"ఎడిటర్‌గారు ఎప్పుడొస్తారు నాయనా?"

"నాకు తెలీదండీ?"

"అసలు వూర్లోవున్నారా బాబూ"?

"తెలీదండీ".

"పోనీ రోజు ఏ టైమ్‌కి వస్తారు తండ్రీ?"

"నాకు తెలీదండీ".

బుర్రగోడకేసి కొట్టుకోవాలనిపించింది నాకు. ఓపిక నశించిపోయింది. వెనక్కు తిరిగాను.

గేటుదగ్గర కనిపించాడు సాహితీ మిత్రుడు. "వాడు వాడు కాదు వీడు" నవలా రచయిత నా ప్రాణం లేచి వచ్చింది. నా గోడు అతనికి చెప్పుకుందాం అనుకుంటూ వుండగానే అతనే నా దగ్గరికి వచ్చాడు.

"చూసారా మేడమ్ వీళ్ళెలా కాల్చుకు తింటున్నారో. ఏడాది అవుతుంది. నా నవల వేసి, ఇంతదాకా డబ్బులివ్వలేదు సరికదా ఏడిపించుకు తింటున్నారు. క్రిందటివారం వస్తే ఎడిటర్‌గారి పేరుమీద ఓ లెటర్ రాయండి అని చెప్పారు. అలాగే రాశాను. ఇప్పుడొచ్చి అడిగితే నువు గుర్నాథంగారి పేరున రాశావు. ఆయన క్రిందటి వారం ఎడిటర్. ఈవారం గొంగూర గోవర్ధనరావు గారు ఎడిటర్. ఇంటికెళ్ళి ఆయన పేరున ఓ లెటర్ రాయి" అంటున్నారు. ఎలా చచ్చేది మేడమ్" అన్నాడు గద్గద కంఠంతో.

ఇంకేం మాట్లాడతాను నా మొహం. ఇంటికి వచ్చేశాను. మా ఆయన్తో జరిగిందంతా చెప్పేను.

"ఏం చేస్తాం గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం అనుకొని వూరుకో. ఇంకా అయోమయం ఆఫీసుకి వెళ్ళకు. ఇప్పటికే చాలా సార్లు తిరిగేవ్. ఆటోలకి వాటికీ తడిసిమోపెడు అయింది" అన్నారు.

ఉసూరుమనిపించింది. కానీ ఏం చెయ్యను? వూరుకున్నాను.

ఓ ఆర్నెల్లు గడిచిపోయాయి. ఒకనాడు పోస్ట్‌మేన్ ఓ పొడుగాటి తెల్లకవర్ ఇచ్చివెళ్లాడు. దాని మీద "అయోమయం" వారి అడ్రస్ వుంది.

నా గుండె ఝల్లుమంది. వణికే చేతుల్లో విప్పాను. అందులో ఒక కాగితం వుంది. దాని మీద ఇలా రాసివుంది.

"నమస్కారాలు. మేము స్థాపించిన "అయోమయం" మాసపత్రిక అశేష పాఠకుల అభినందనలు అందుకుంటూ అగ్రస్థానాన్ని చేరుకుంది. మీ అందరి ప్రోత్సాహంతో మేము త్వరలో అస్తమయం అనే వార పత్రికను ప్రారంభిస్తున్నాం. మా అస్తమయం పత్రికకు మీ రచనలు పంపమని కోరుతున్నాం. మీ సహాయ సహకారాలు మాకెప్పుడూ లభించగలవని ఆశిస్తున్నాం.

అభినందనలతో అయోమయం"

*హారిక, 11 మే 1990*